సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం ı 16 ı అక్టోబర్ ı 2023



108లో సుఖ ప్రసవం
కొయ్యూరు మండలం యు.బీడిపాలెం పంచాయతీ ఈదులబంద గ్రామానికి చెందిన సిందేరి రత్న 108లో ప్రసవించింది. 10లో



పర్యాటకుల పరవశం 10లో
టూరిస్టు స్పాట్‌లు ఆదివారం సందర్శకులతో కళకళలాడాయి. నీటి ప్రవాహాల వద్ద పర్యాటకులు కేరింతలతో జలకాలాడారు.



గంజాయి స్వాధీనం
కారులో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని ముంచంగిపుట్టు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 10లో

ఐటీ డెస్టినీ విశాఖ

- బీచ్ ఐటీ డెస్టినేషన్ కాన్సెప్ట్‌తో సరికొత్తగా ముందుకు..
- బీజం వేసిన దిగ్గజ కంపెనీ ఇన్ఫోసిస్
- నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా ప్రారంభం
- అదే బాటలో విప్రో 1000 మందితో విస్తరణకు ప్రణాళికలు
- భవిష్యత్తులో మరిన్ని కంపెనీలు విస్తరించేందుకు ఆసక్తి
- ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటుకు అడుగులు



ఇన్ఫోసిస్ డెవలప్‌మెంట్ సెంటర్

సాక్షి, విశాఖపట్నం : భారత్‌ని నడిపించే చోదక శక్తులుగా మారుతున్న టైర్–2 నగరాల్లో ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు.. తమ శాఖల్ని విస్తరించుకుంటున్నాయి. మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చెందుతూ.. సకల సౌకర్యాలతో పరిఢవిల్లుతున్న టైర్–2 నగరాల్లో మిన్నగా ఉన్న విశాఖను మొదటి ఆప్షన్‌గా ఎంపిక చేసుకుంటూ తమ సంస్థ కార్యాలయాల్ని ఏర్పాటు చేసుకుంటున్నాయి. అద్భుతమైన ఐటీ పాలసీని ప్రవేశపెడుతూ.. మరోవైపు.. ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖపట్నంలో అపారమైన అవకాశాలున్నాయని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ప్రభుత్వం బీచ్ ఐటీ కాన్సెప్ట్‌ని ప్రమోట్ చేసింది. అందుకే అంతర్జాతీయంగా పేరొందిన ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు తరలివస్తున్నాయి. టెక్ మహీంద్ర, హెచ్‌సీఎల్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్, డబ్ల్యూఎన్‌ఎస్ మొదలైన ఐటీ, ఐటీ అనుబంధ దిగ్గజ సంస్థలు విశాఖ వైపు అడుగులు వేశాయి. తాజాగా ఇన్ఫోసిస్ సంస్థ తన డెవలప్‌మెంట్ సెంటర్ కార్యకలాపాలను మొదలుపెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఇన్ఫోసిస్‌ని ప్రారంభించనున్నారు. తొలి దశలో 1000 మందితో కార్యకలాపాలు ప్రారంభించి దశలవారీగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అడుగులు వేస్తున్న మరిన్ని సంస్థలు

ఇన్ఫోసిస్ మాదిరిగా విశాఖలో తమ కార్యకలాపాలు విస్తరించేందుకు అనేక ఐటీ సంస్థలు ముందుకు వస్తున్నాయి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలో 2006లో విప్రో క్యాంపస్‌కు స్థలాన్ని కేటాయించారు. 750 మందితో ప్రారంభించాలని భావించినా.. చంద్రబాబు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లేకపోవడంతో 300 మందితో ప్రస్థానం మొదలు పెట్టింది. ఇప్పుడు కార్యకలాపాల జోరు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం విప్రో ప్రతినిధులతో చర్చించింది. దశల వారీగా 1000 సీట్లకు విస్తరించేందుకు సిద్ధమని ప్రకటించింది. వర్చువల్ డెస్క్‌టాప్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్(వీడీఐ), క్లౌడ్ ప్రాజెక్టులకు కేంద్రంగా విశాఖ క్యాంపస్‌ని మార్చాలని నిర్ణయించింది. విశాఖలో స్టార్టప్‌ల ఏర్పాటుకు తాము సిద్ధంగా ఉన్నామంటూ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్(నాస్కామ్) సీఈవో సంజీవ్ మల్హోత్రా ప్రకటించారు. అదేవిధంగా ఐటీ రంగంలో తిరుగులేని నగరంగా విశాఖను అభివృద్ధి చేసేందుకు ఇక్కడే ఐటీ ఎమర్జింగ్ టెక్నాలజీ రీసెర్చ్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. ఐటీ పరిశోధనలు, అభివృద్ధిలో భాగంగా.. ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఎకోసిస్టమ్‌ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు కేంబ్రిడ్జిలోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎంఐటీ) సహకారంతో పాటు సంయుక్త సర్టిఫికేషన్ కోర్సుల్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది. ఇందుకోసం ఐఏఎస్ అధికారులతో కూడిన ప్యానెల్‌ని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

మహానేత వైఎస్ హయాంలోనే..

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే విశాఖలో ఐటీకి అడుగులు పడ్డాయి. మధురవాడలోని మూడు కొండల మధ్య 300 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన సెజ్‌లో తొలిదశలో ఇన్ఫోటెక్, సింబియాసిస్, మిరాకిల్, కెనెక్సా వంటి ప్రముఖ ఐటీ కంపెనీలు సహా మొత్తం 26 సంస్థలు తరలివచ్చాయి. క్రమంగా సంస్థలు పెరిగాయి. అయితే.. రూ.1800 కోట్లకు చేరుకున్న ఎగుమతులు ఆయన మరణానంతరం చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక.. రూ.1400కి పడిపోయాయి. అనంతరం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విశాఖలో ఐటీ అభివృద్ధిపై సీఎం వైఎస్ జగన్ దృష్టిసారించారు. గత ప్రభుత్వ హయాంలో బకాయి పడ్డ వందకోట్ల ప్రోత్సాహకాలను వెంటనే విడుదల చేశారు. అద్భుతమైన ఐటీ పాలసీని రూపొందించిన ప్రభుత్వం దిగ్గజ సంస్థల్ని ఆకర్షిస్తోంది.

అపారమైన అవకాశాలు



ఐటీ, ఐటీ ఆధారిత పరిశ్రమలకు హబ్‌గా త్వరలోనే అభివృద్ధి చెందేందుకు విశాఖలో అపారమైన అవకాశాలున్నాయి. ఐటీ పరిశ్రమలన్నీ తమ తదుపరి డెస్టినేషన్‌గా ద్వితీయ శ్రేణి నగరాల్ని ఎంపిక చేసుకుంటున్నాయి. ఐటీ సర్వీస్ సెక్టార్ పరిశ్రమల ఏర్పాటుకు వైజాగ్ వంటి నగరాలే మొదటి ప్రాధాన్యం. ఐటీ సంస్థలకు కావల్సిన మానవ వనరుల్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఎమర్జింగ్ టెక్నాలజీ, కోర్ ఐటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులపై సంస్థలు దృష్టిసారిస్తూ విశాఖలో కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

– కిరణ్‌రెడ్డి, ఎపిటా గ్రూప్ సీఈవో

సీఎం పర్యటన ఇలా..



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఉదయం 10.20 గంటలకు సీఎం విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.40 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్ నెం.3 వద్దకు వస్తారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన ఐటీ హిల్ నెం.2కు చేరుకొని ఇన్ఫోసిస్ కార్యకలాపాల్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం ఇన్ఫోసిస్, వివిధ ఐటీ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి కాసేపు సంభాషించనున్నారు. అనంతరం 11.55 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకొని అక్కడ జీవీఎంసీ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ మిషన్ ప్రారంభిస్తారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 12.15 గంటలకు పరవాడ చేరుకొని ఫార్మా సిటీలో గల యుజియా స్టెరైల్ ప్రైవేట్ లిమిటెడ్‌ను ప్రారంభిస్తారు. అనంతరం అచ్యుతాపురం సెజ్‌లో హెలిప్యాడ్ వద్దకు చేరుకొని.. అక్కడ మధ్యాహ్నం 1.30 నుంచి 1.45 వరకు ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి లారెస్ ల్యాబ్‌కు చేరుకొని యూనిట్–2ను ప్రారంభిస్తారు. పరిశ్రమను సందర్శించి, కంపెనీ సీఈఓ, డైరెక్టర్లు, ఉద్యోగులతో ఇంటరాక్ట్ అవుతారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో 3.10 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు వస్తారు. అక్కడ నుంచి 3.20 గంటలకు తిరుగు పయనమవుతారు.

భవిష్యత్‌లో మరిన్ని ఐటీ సంస్థలు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కొమ్మాది(విశాఖ): భవిష్యత్‌లో విశాఖకు మరిన్ని ఐటీసంస్థలు వచ్చే అవకాశం ఉందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సోమవారం సీఎం జగన్‌మోహన్ రెడ్డి రుషికొండలో గల ఇన్ఫోసిస్ కార్యాలయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ ఉత్పత్తుల్లో విశాఖను సముచిత స్థానం నిలిపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇన్ఫోసిస్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకుందని, మొదటి విడతలో వెయ్యి మంది ఉద్యోగులతో ఇన్ఫోసిస్ కార్యాలయం ప్రారంభం కానుందని తెలిపారు. ఆయన వెంట మేయర్ గొలగాని హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఉన్నారు.

న్యూస్‌రీల్

ఎస్టీ కమిషన్ చైర్మన్ పర్యటన రేపు


అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో ఈనెల 17న ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకరరావు పర్యటించనున్నట్టు ఎస్టీ కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి ఆదివారం తెలిపారు. గిరిజనుల నుంచి ఎస్టీ కమిషన్ చైర్మన్ వినతులను స్వీకరిస్తారని ఆమె తెలిపారు.

160 మందికి ఉచిత భోజన వసతి

- అరకు ఎంపీ మాధవికి గిరిజన అభ్యర్థుల కృతజ్ఞతలు

కొయ్యూరు: విశాఖపట్నంలో శని, ఆదివారాలు నిర్వహించిన ఎస్‌ఐ పోస్టుల తుది రాత పరీక్షకు అరకుపార్లమెంట్ నియోజకవర్గం నుంచి హాజరైన గిరిజన అభ్యర్థులకు ఎంపీ గొడ్డేటి మాధవి ఉచితంగా భోజన వసతి కల్పించారు. ఎస్‌ఐ రాతపరీక్ష రాసేందుకు విశాఖ వస్తున్న వారికి భోజన వసతిని ఏర్పాటు చేస్తామని ఎంపీ ముందుగానే ప్రకటించారు. ఆ మేరకు 160 మందికి భోజనం సమకూర్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో అభ్యర్థులు పరీక్ష రాయడానికి రావడం ఆనందంగా ఉందన్నారు. తమకు అన్ని సౌకర్యాలు కల్పించిన ఎంపీ మాధవికి గిరిజన అభ్యర్థులు కృతజ్ఞతలు తెలిపారు.

మారెమ్మతల్లికి వెండి మకరతోరణం



అమ్మవారికి మకర తోరణం సమర్పిస్తున్న ప్రవీణ్ కుమార్ దంపతులు

సీలేరు: స్థానిక శ్రీ మారెమ్మ తల్లి అమ్మవారికి ఖమ్మం ప్రాంతానికి చెందిన మిత్ర గ్రూప్ సంస్థల చైర్మన్ కె.ప్రవీణ్ కుమార్, మాధవి దంపతులు ఆదివారంరూ.4.5లక్షల విలువ చేసే వెండి మకర తోరణం సమర్పించారు. మొక్కు తీరడంతో మకరతోరణం అందజేసినట్టు వారు తెలిపారు. ఈసందర్భంగా ఆ దంపతులను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ బి–42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.సురేష్, ఎస్‌ఐ రామకృష్ణ,సర్పంచ్ దుర్గో, కారె శ్రీనివాసు, ఎం.రమణారావు పాల్గొన్నారు.

చల్లని తల్లికి.. ప్రణమిల్లి

- జిల్లాలో ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాల్లో పెద్ద ఎత్తున్న కుంకుమార్చనలు
- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు



పవనగిరి క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు



కొయ్యూరులో గరగలను ఊరేగిస్తున్న భవానీ భక్తులు



పాడేరులో మోదకొండమ్మ అమ్మవారు

సాక్షి, నెట్‌వర్క్ : శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలో అమ్మవారి ఆలయాలను, ఉత్సవ మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్‌దీపాల ఆలంకరణలో ఆలయాలు శోభాయమానంగా దర్శనమిచ్చాయి. ఉత్సవాల మొదటి రోజు అమ్మను దర్శించుకుని భక్తులు అలౌకికానందం పొందారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పాడేరు మోదకొండమ్మ తల్లి, సీలేరు వనదుర్గమ్మ ఆలయం, అడ్డతీగల మండలంలోని పవనగిరి క్షేత్రం తదితర పలు ఆలయాల్లో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు భవానీ మాలలు ధరించారు. మాలలు ధరించిన భక్తులు కొయ్యూరలో గరగలు ఊరేగించారు.

గిరిజన చట్టాలకు కేంద్రం తూట్లు

సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



ఆదివాసీ ఘోష సభలో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

రంపచోడవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీఎం మోదీ నాయకత్వంలో తీసుకుంటున్న నిర్ణయాలు గిరిజనుల మనుగడను తీవ్రంగా దెబ్బతీసే విధంగా ఉన్నాయని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. ప్రమాదకరమైన నిర్ణయాలతో కేంద్ర ప్రభుత్వం గిరిజనుల చట్టాలకు తూట్లు పొడుస్తోందని చెప్పారు. అటవీ హక్కు, మైనింగ్ చట్టాలకు సవరణ చేసిందన్నారు. రంపచోడవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన జరిగిన 'ఆదివాసీ అరణ్య ఘోష' బహిరంగ సభలో బీవీ రాఘవులు పాల్గొన్నారు. అంతకుముందు ఐటీడీఏ కార్యాలయం నుంచి సభాస్థలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో బీవీ రాఘవులు మాట్లాడుతూ అటవీ హక్కులు, మైనింగ్ చట్టాల సవరణతో గిరిజన హక్కులను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా హరించి వేసిందని తెలిపారు. గతంలో పోరాటాలు చేసి వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకువచ్చి చేయించిన చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని, నిర్వాసితుల సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. పెట్టుబడిదారులకు వత్తాసు పలికే పార్టీలకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు.ఇండియా కూటమి బలపడుతుందనే భయంతో బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని చెప్పారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఎం అభ్యర్థులను అసెంబ్లీకి పంపడం ద్వారా సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒంటరిగానైనా పోరాటానికి సిద్ధమవుతామని తెలిపారు.ఈ సభలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో గిరిజనుడి మృతి



బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో మృతిచెందిన వంతాల మోహన్

అనంతగిరి: మండలంలోని అరకు–విశాఖ ప్రధాన రహదారిలో శివలింగపురం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజనుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పర్యాటకులతో వస్తున్న గాయత్రీ ట్రావెల్స్ బస్సు.. బైక్‌పై వెళుతున్న కొత్తూరు గ్రామానికి చెందిన వంతాల మోహన్(30)ను శివలింగపురం సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వంతాల మోహన్ రోడ్డుపై ఎగిరిపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కొత్తూరు గ్రామ సమీపంలోని ప్రమాదం చోటుచేసుకోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అనంతగిరి ఎస్ఐ కరక రాము కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అల్లూరికి ఘన నివాళి



అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అడ్డతీగల: స్వాతంత్ర పోరాట సమయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అడ్డతీగల పోలీస్‌స్టేషన్‌పై దాడిచేసి ఈనెల 15 నాటికి 101 ఏళ్లు పూర్తి అయిన నేపథ్యంలో అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాడు అల్లూరి దాడిచేసిన వాస్తవ పోలీస్‌స్టేషన్‌ని సందర్శించారు. అనంతరం సమీపంలో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘం జాతీయ కార్యదర్శి రామన శ్రీను, కార్యవర్గ సభ్యులు దంగేటి సత్తిబాబు, చోడిశెట్టి సుబ్బారావు, ఏఎస్ఐ బుచ్చిదొర, పోలీసు సిబ్బంది, అల్లూరి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



పాడేరులోని కనకదుర్గమ్మతల్లి విగ్రహం



పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట కనకదుర్గమ్మ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న కొట్టగుళ్లి సింహాచలంనాయుడు, కమిటీ ప్రతినిధులు



పాడేరు గోల్డ్ మార్కెట్‌లో కొలువుదీరిన కామాక్షమ్మ తల్లి విగ్రహానికి పూజలు చేస్తున్న విశ్వబ్రహ్మణ కుటుంబాలు

సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా శనరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన పాడేరులోని ఆర్టీసీ కాంప్లెక్సు రోడ్డులోని దుర్గమ్మ ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాలను ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రారంభించారు. దుర్గాదేవి విగ్రహానికి నవరాత్రి తొలిరోజు బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఆలయ సమీపంలోని మండపం వద్ద ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్టించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. మోదకొండమ్మతల్లి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు,దుర్గమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు రొబ్బి రాము,శివరాత్రి శ్రీనివాసరావు,వియ్యపు వెంకట్,గబ్బాడ సింహాచలం తదితరులు ఉత్సవ విగ్రహానికి పూజలు జరిపారు. పాడేరు మోదకొండమ్మతల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక భక్తులతో పాటు మైదాన ప్రాంతానికి చెందిన వారు మోదకొండమ్మను దర్శించుకున్నారు. అమ్మ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ శంకరరావు దంపతులు భక్తులకు ఉచితంగా ప్రసాదాలను పంపిణీ చేశారు. మండలంలోని నడిమివీధి, ఇరడాపల్లి గ్రామాల్లో



ఆలయం వద్ద ఉచిత ప్రసాదాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరరావు దంపతులు

గిరిజనులు నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని కనకదుర్గమ్మతల్లి ఆలయ ప్రాంగాణంలో భవానీ భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా దాతల సాయంతో రోజూ అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధి రొబ్బి రాము తెలిపారు.

కామాక్షమ్మ ఆలయంలో...

పాడేరు పట్టణంలోని గోల్డ్‌మార్కెట్‌లో కామాక్షమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాడేరు పట్టణ విశ్వబ్రహ్మణ సంఘం,బంగారం వర్తకుల ఆధ్వర్యంలో కామాక్షమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం గోల్డ్‌మార్కెట్‌లోని శంకులమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన మండపంలో కామాక్షమ్మ విగ్రహాన్ని ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.తొలిరోజు బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు.బంగారం వర్తకుల సంఘం అధ్యక్షులు సున్నం సత్యనారాయణ,విశ్వ బ్రహ్మణ సంఘం ప్రతినిధులు దిమిలి రమణ,నవర గోవిందరావు,శ్రీశైలం నానాజీ,నవర కుమారి పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

- ఇద్దరి అరెస్టు, ఒకరు పరారీ

ముంచంగిపుట్టు: కారులో తరలిస్తున్న 50 కిలోల గంజాయిని ఆదివారం పట్టుకున్నట్టు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ముంచంగిపుట్టు మీదుగా పాడేరు వెళుతున్న ఇన్నోవా కారును ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడిందని, గంజాయి స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేశామని చెప్పారు. ఒకరు పరారయ్యారని తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు లక్ష విలువ ఉంటుందని తెలిపారు.

డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

చింతూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 16 నుంచి 19వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తమ కళాశాలలో బీఏ ఆనర్స్ పొలిటికల్ సైన్స్, బీఏ ఆనర్స్ ఎకనామిక్స్, బీకాం ఆనర్స్ జనరల్ (మైనర్ కంప్యూటర్ అప్లికేషన్స్), బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఆనర్స్ జంతు శాస్త్రం, బీఎస్సీ ఆనర్స్ రసాయన శాస్త్రం కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందించే జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన అందిస్తామని ఆయన తెలిపారు. డిగ్రీ కోర్సుల విద్యా బోధనతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ అందిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

మన్యంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు



డాక్టర్ గంగాధర్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న సేవాభారతి ప్రతినిధులు

చింతూరు: మారుమూల గ్రామాల్లో పుట్టి చదువుకు, కనీస అవసరాలకు దూరంగా ఉంటున్న గిరిబిడ్డలకు సేవాభారతి అండగా నిలుస్తోందని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సాయికిషోర్ అన్నారు. సేవాభారతి ఆధ్వర్యంలో విద్యార్థి వికాసయోజన కార్యక్రమంలో భాగంగా ఆదివారం చింతూరులో గిరిజన విద్యార్థులు, ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులకు చేదోడు, వాదోడుగా, ఇంటిపనులకే పరిమితమైన గిరిబిడ్డలను మారుమూల గ్రామాల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు వంటి నగరాలకు చేర్చి కళాశాలల్లో విద్యనభ్యసించేలా చేయూతనిచ్చామని తెలిపారు. వారంతా ప్రస్తుతం ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, నర్సులుగా, ఉపాధ్యాయులుగా పలు రంగాల్లో రాణిస్తున్నారని, అటు వృత్తి జీవితంలోనూ, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ విజయవంతంగా సాగుతున్నారన్నారు. పోలవరం ముంపు మండలాలైన చింతూరు, వీఆర్ పురం, కూనవరం, వేలేరుపాడు మండలాలతో పాటు కుక్కనూరు, భద్రాచలం, ఎటపాక మండలాల్లోని సుమారు 200 మారుమూల గ్రామాలకు చెందిన ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు, వైద్య సౌకర్యాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. అనంతరం ఏజన్సీలో సేవాభారతి కార్యక్రమాల అమలుకు కృషి చేస్తున్న డాక్టర్ గంగాధరప్రసాద్, ఆవుల సుబ్బారావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అఖిల భారత కార్యదర్శి డాక్టర్ మురళీకృష్ణ, ఆరోగ్యభారతి రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ రావు, గారపాటి నారాయణ, కట్టం ముత్తయ్య, లక్ష్మీ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీకొని ఐదుగురికి గాయాలు



ఢీ కొట్టిన కారు ముందు భాగం నుజ్జయిన దృశ్యం

అక్కిరెడ్డిపాలెం: మలుపు తిరుగుతున్న కారును వేగంగా వస్తున్న మరో కారు ఢీకొట్టిన ఘటన విశాఖ డెయిరీ పార్లర్ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. గాజువాక పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. టౌన్ నుంచి వస్తున్న కారు నాతయ్యపాలెం వైపు వెళ్లేందుకు మలుపు తిరుగుతోంది.. కారులో ముగ్గురు మహిళలు, డ్రైవర్ ఉన్నారు. ఇదే సమయంలో పరవాడ నుంచి సింహాచలం వైపు వెళుతున్న కారు బలంగా ఢీకొట్టింది. ఈ కారులో ఏడుగురు ప్రయాణిస్తున్నారు. వీరిలో ముగ్గురితో పాటు ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మలుపు తిరుగుతున్న కారులో ఒక మహిళ గాయపడింది. వీరిని షీలానగర్‌లో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. గాజువాక పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రేత అరెస్ట్

రావికమతం: పది లీటర్ల సారాతోపాటు నిందితుడిని అరెస్ట్ చేశామని ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని చిన కుముందానిపేటలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. గ్రామానికి చెందిన గెంజి ఈశ్వరరావును అరెస్ట్ చేసి, అతడి నుంచి పది లీటర్ల సారాతో పాటు టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ స్వాధీనం చేసుకున్నామన్నారు.

108లో సుఖ ప్రసవం



తల్లీబిడ్డలతో 108 సిబ్బంది

వై.రామవరం: మండల సరిహద్దు ప్రాంతమైన కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీ ఈదులబంద గ్రామానికి చెందిన సిందేరి రత్న(39) అనే గిరిజన మహిళ ఆదివారం 108లో ప్రసవించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన వై.రామవరానికి ఈదులబంద గ్రామం సుమారు 35 కిలోమీటర్ల దూరంలో కొండప్రాంతంలో ఉంది. ఆ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఆ గర్భిణిని కుటుంబ సభ్యులు, 108 సిబ్బంది డోలీలో మోసుకొచ్చి అంబులెన్సు వద్దకు తరలించారు. అక్కడి నుంచి వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు ఎక్కువయ్యాయి. ఈఎంటీ సుజాత, పైలెట్ జి.రవితేజలు ఆమెకు ప్రసవం చేశారు. మగబిడ్డకు జన్మనివ్వగా, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. వారిని వై రామవరం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు.

నేడు ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ప్రారంభం



ప్రారంభానికి సిద్ధమైన హెచ్‌పీసీఎల్ బంక్

సాక్షి, పాడేరు: ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్ ప్రారంభానికి సిద్ధమైంది. పాడేరు మెడికల్ కళాశాల సమీపంలో ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన ఈ బంక్‌ను ఐటీడీఏ, హెచ్‌పీసీఎల్ సంయుక్తంగా ఏర్పాటు చేశాయి. ఈ బంక్‌ను సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌లు ప్రారంభించనున్నారు. బంక్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లను ఐటీడీఏ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. పాడేరు పట్టణంలో ఇప్పటికే నాలుగు బంక్‌లు అందుబాటులో ఉండగా, ఐటీడీఏ మరో బంక్‌ను నిత్యం రద్దీగా ఉండే చింతలవీధి రోడ్డులో ప్రారంభిస్తోంది.

నేడు 12అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం

పాడేరు ఐటీడీఏ పరిధిలో కొత్తగా నిర్మించిన 12 అంగన్‌వాడీ భవనాలను సోమవారం పాడేరు ఐటీడీఏ వేదిక వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిలు ప్రారంభిస్తారనిఐటీడీఏ పివో వి.అభిషేక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రంగ స్థలంపై దసరా సందడి

- ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవాలు ప్రారంభం
- 19వ తేదీ వరకూ నాటికల ప్రదర్శనలు



నాటిక పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: గవరపాలేం సతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి దసరా నవ రాత్రి మహోత్సవాన్ని పురస్కరించుకుని గౌరీ సేవాసంఘం మళ్ల జగన్నాథం కల్యాణమండపంలో కర్రి రమేష్ మెమోరియల్ ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికోత్సవ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నాటక పోటీలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఏడాది శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 19వ తేదీ వరకూ నాటికలు జరుగుతాయన్నారు.

'జరుగుతున్న కథ'..

గుంటూరు జిల్లా తాడేపల్లి అరవింద్ ఆర్ట్స్ వారి ప్రదర్శన. వృద్ధాప్యం అనివార్యం. వృద్ధాప్యంలో ఆసరాగా ఉండాల్సిన పిల్లలు, చదువుల పేరుతోనో, ఉద్యోగాల పేరుతోనే దూరంగా ఉంటున్నారు. తల్లి దండ్రుల 25,30 సంవత్సరాల ఉద్యోగ జీవితంలో సంపాదించినది పిల్లలు తమతమ అవసరాల కోసం వారివద్ద నుంచి తీసుకొని వారికి ఆర్థిక భరోసా లేకుండా చేస్తున్నారు. చిన్నచిన్న అవసరాలకు కూడా వృద్ధాప్యంలో పిల్లలపై ఆధారపడవలసిన స్థితిరావడటం ఎంతైనా గర్హనీయం, పిల్లలపై ప్రేమ ఉండాలి. అది ఎంతవరకు ఉండాలనే విచక్షణ కూడా ఉండాలి. లేకపోతే వృద్ధాప్యంలో మనుగడ కష్టమవుతుంది, వృద్ధులూ తస్మాత జాగ్రత్త అనే అంశంపై జరుగుతున్న కథ నాటిక ప్రద ర్శించారు. నాటిక రచన–ఆకెళ్ల, దర్శకత్వం గంగోత్రిసాయి, సంగీతం కె.సత్యనారాయణమూర్తి నిర్వహించారు.

'ఖరీదైన జైళ్లు' నాటిక...

తెలంగాణలోని, కరీంనగర్ జిలా , చైతన్య కళాభారతి వారి ప్రదర్శన ఇది. కథా సంగ్రహం...మనిషి అంటే కాళ్ళుచేతులు, కళ్లు నోరు, ఇలా అవయవాలు కాదు, అది జంతువులకు కూడా ఉంటాయి. జంతువుల నుంచి మనిషిని వేరుచేసేది మనసు అదిదేవుడు మనిషిమాత్రమే ఇచ్చాడు. మనిషిగా పుట్టి కూడా చాలా మంది ఇంకా అవయవాలతోనే బతికేస్తున్నారు. అన్న ఇతివృత్తమై 'ఖరీదైన జైళ్లు' నాటిక సారాంశం. దీనికి నాటకీకరణ పి.శివరాం, దర్శకత్వం మంచాల రమేష్, సంగీతం సురభి నాగరాజు, మూలకథ పి.వెంకటేశ్వరరావు అందించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపాల్ చైర్మన్ మళ్ల సాంబశివరావు, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసి నాయుడు, కమిటీ సభ్యులు కె.ఎం. నాయుడు, కొణతాల పూర్ణచంద్రరావు, మళ్ల సూరిబాబు, పి.వి.సత్యనారాయణ, శివాజీ పాల్గొన్నారు.

పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం : ఇటీవల వాల్తేర్ డివిజన్, కొత్తవలస – కిరండూల్ (కేకే) లైన్, మనబార్ – జరాటి స్టేషన్ పరిధిలో రైల్వేట్రాక్‌పై కొండ చరియలు విరిగిపడిన ప్రాంతంలో పునరుద్ధరణ పనులు ముగిసినప్పటికీ ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లకు ఇంకా అనుమతులు ఇవ్వలేదు. ఈ కారణంగా పలు రైళ్లు ఆయా తేదీల్లో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లైన్‌లో ప్రస్తుతం గూడ్స్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

- భువనేశ్వర్‌లో ఈ నెల 15, 16న బయల్దేరే భువనేశ్వర్ – జగదల్‌పూర్ (18447) హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – భువనేశ్వర్ (18448) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, 17న కోరాపుట్ నుంచి బయల్దేరి భువనేశ్వర్ చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈ నెల 15, 16న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌గా ఈ నెల 16, 17న కోరాపుట్ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- విశాఖపట్నంలో ఈ నెల 16, 17న బయల్దేరే విశాఖపట్నం – కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ అరకు వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బయల్దేరాల్సిన కిరండూల్ – విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ ఈ నెల 16, 17న అరకు నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది.
- హౌరాలో ఈ నెల 15, 16న బయల్దేరే హౌరా – జగదల్‌పూర్ (18005) సమలేశ్వరి ఎక్స్‌ప్రెస్ టిట్లాఘడ్ వరకే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో జగదల్‌పూర్‌లో బయల్దేరాల్సిన జగదల్‌పూర్ – హౌరా (18006) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16, 17న టిట్లాఘడ్ నుంచి బయల్దేరి హౌరా చేరుకుంటుంది.

ప్రకృతి శోయగం... పర్యాటకుల పరవశం



వంజంగిహిల్స్‌పై పర్యాటకుల సందడి



బొర్రాకు పోటెత్తిన పర్యాటకులు



గిరిజన మ్యూజియం వద్ద..

సాక్షి,పాడేరు/అరకులోయ టౌన్/జి.మాడుగుల/డుంబ్రిగుడు/ అనంతగిరి: పచ్చదనంతో నిండిన కొండలు.. ఎత్తు నుంచి జాలువారుతున్న జలపాతాలు... అరకులోయ అందాలు, బొర్రా గుహలను తిలకించిన పర్యాటకులు పరవశించిపోయారు. శని,ఆదివారాలు సెలవులు కావడంతో జిల్లాలోని టూరిస్టు స్పాట్‌లకు పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చి సందడి చేశారు. శనివారం సాయంత్రం నుంచి పర్యాటకుల తాకిడి మొదలైంది. బస్సులు, కార్లు, ఆటోలు, జీపుల్లో అధిక సంఖ్యలో అరకులోయకు తరలివచ్చారు. విశాఖ–అరకు ప్రధాన రహదారిలో సెల్ఫీలు తీసుకుంటూ ఆనందంగా గడిపారు.

- పాడేరుకు సమీపంలోని వంజంగి హిల్స్‌కు పర్యాటకులు భారీగా తరలివచ్చారు.వేకువజాము నుంచే వంజంగి శిఖర ప్రాంతాలకు పర్యాటకులు ట్రెక్కింగ్ నిర్వహించారు.సూర్యోదయం,ఆతరువాత పొగమంచు,మేఘాల అందాలను వీక్షించిన పర్యాటకులు ఇక్కడ ప్రకృతి అందాలకు ఫిదా అయ్యారు.
- జి.మాడుగుల మండలంలో కొత్తపల్లి జలపాతానికి పలు ప్రాంతాలను నుంచి ఆదివారం పర్యాటకులు వచ్చి సందడి చేశారు. పెద్ద పెద్ద బండరాళ్ల పైనుంచి పడుతున్న నీటి ప్రవాహంలో కేరింతలతో అన్ని వయస్సుల వారు జలకాలాడారు. రోజంతా కుటుంబ సభ్యులతో ఆటపాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు.
- అనంతగిరి మండలంలోని బొర్రా గుహలను శనివారం 1,700 మంది తిలకించగా, రూ.1.70 లక్షల ఆదాయం లభించింది. ఆదివారం 3,500 మంది సందర్శించగా, రూ.2.70 లక్షల ఆదాయం వచ్చింది. మండలంలోని సరియా, తాటిగుడ, చిట్టంపాడు, కటికి జలపాతాలు, డముకు వ్యూపాయింట్, తదితర సందర్శిత ప్రాంతాలన్నీ పర్యాటకులతో కళకళలాడాయి.
- డుంబ్రిగుడ మండలంలోని చాపరాయి జలపాతానికి ఆదివారం పర్యాటకులు పెద్ద సంఖ్యలో వచ్చి సందడి చేశారు. ప్రవాహంలో జలకాలాడి, కుటుంబ సభ్యులు, స్నేహితులతో సరదాగా గడిపారు.



కొత్తపల్లి జలపాతం వద్ద..

తానా పురస్కార గ్రహీతకు సత్కారం

తుమ్మపాల: తానా కావ్య రచన పోటీలలో స్థానికుడు బులుసు వేంకటేశ్వర్లు రూ.లక్ష బహుమతి పురస్కారం పొందడం అభినందనీయమని ఎంపీ సత్యవతి అన్నారు. వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వేదికగా ఆదివారం ఆంధ్రపద్య కవితా సదస్సు ఆధ్వర్యంలో అభినందన సభలో పాల్గొని వేంకటేశ్వర్లును సత్కరించారు. ఆమె మాట్లాడుతూ తెలుగు పద్యం, కావ్యం గొప్పతనాన్ని ప్రపంచ సభల్లో ప్రస్తావించడం, వేంకటేశ్వర్లు కావ్యం ప్రాముఖ్యాన్ని సంతరించుకోవడం మన ప్రాంత గొప్పతనాన్ని చాటిచెప్పడమేనన్నారు.

నాగేంద్రప్రసాద్‌కు రైతు నేస్తం పురస్కారం

రాంబిల్లి: హరిపురం బీసీటీ కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్‌కు పద్మశ్రీ ఐవీ సుబ్బారావు రైతు నేస్తం 2023 పురస్కారం దక్కింది. కృష్ణా జిల్లా గన్నవరంలో స్వర్ణభారతి ట్రస్ట్‌లో శనివారం ఈ పురస్కారాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు తనకు అందించినట్లు నాగేంద్రప్రసాద్ తెలిపారు. ముప్పవరపు ఫౌండేషన్, రైతు నేస్తం వ్యవసాయ మాసపత్రిక సంయుక్తంగా ఈ పురస్కారం అందజేశాయి. ప్రకృతి వ్యవసాయం, అపరాలు, వరి, ఉద్యాన పంటలపై రైతులకు అందిస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు.